# ప్రయాణం

**"ఏవండీ!" పొద్దున్నే ఒకచేత్తో పొగలు కక్కుతున్న కాఫీ యిస్తూ, భర్తకి దగ్గరగా జరిగి అతని భుజం మీద తల ఆనించి ముద్దుగా పల్చింది నీరజ.**

"ఏమిటోయ్? ఏమిటి సంగతి?" ఆమె తలని పైకెత్తుతూ చిలిపిగా అడిగేడు శేఖరం.

"ఏం లేదు... మా వూరు.. వెళ్లాలని వుందండీ. మా నాన్నగారికి వంట్లో బాగుండడం లేదని ప్రతీ వుత్తరంలోనూ వ్రాస్తున్నారు. "మీ ఆరోగ్యం జాగ్రత్త" అని నేనొక ముక్క వ్రాసి పడేస్తే సరిపోతుందా! ఒకసారి వెళ్లి చూసొస్తే బాగుంటుంది."

ఆలోచనలో పడ్డాడు శేఖరం. ఇప్పుడు తనకి శలవు లేదు. నీరజ వెంట వెళ్లి ఆమె వున్నన్నాళ్లు అక్కడ వుండి తిరిగి ఆమె వెంట రావడం... యివన్నీ తనకి కుదరవు. ఇప్పటికి నీరజ ఎన్నోసార్లు చెప్పింది. వూరికి వెళ్లడం గురించి. ఇన్ని సార్లు చెప్పినా పంపించకపోతే, ఆరున్నొక్క రాగం మొదలెడుతుంది. పాపం ఎన్నాళ్ల బట్టో అంటున్నాది వెళ్తానని! అందులోనూ, ఇప్పుడు సాక్షాత్తూ తన కన్నతండ్రికే ఒంట్లో బాగులేదు. రమ్మని ఎన్నో ఉత్తరాలు.

"సరే. నువ్వు మీ వూరికి వెళ్తావు. బాగానే వుంది. కాని ఇక్కడ నీ నాథుడి గతి!..."

నీరజ నవ్వింది.

"ఏముంది! మీ కెలాగూ వంట వచ్చు కదా. ఒక్క వారం పది రోజుల్లో వచ్చేస్తాను. ఈ వారం పది రోజులూ కొంచెం అడ్జస్టు అయిపోండి. మరేం చేస్తాం? ఎప్పటికప్పుడు యిలాగే వెళ్లడం అవకుండా వుంది."

"వండుకు తినేస్తే దాంతో సరిపోతుందా?"

"పోనీ కాఫీ, టిఫిను కూడా చేసుకుంటారు?"

"కాఫీ - టిఫిను చేసేసుకుంటే సరిపోతుందా?"

"ఇంకేం కావాలండీ? హాయిగా భోం చేసి ముసుగుతన్ని పడుకొంటారు!"

"ఎలా పడుకోవడం?"

"ఎలా పడుకోవడం ఏమిటి?'

"అదేనోయ్. ఈ చలికాలంలో నువ్వు పక్కన లేకుండా ఎలా పడుకోవడం? ఈ చలితో... నీ వెచ్చని కౌగిలిలో..." పాటలా పాడుతూ ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

"పొండి". సిగ్గు ముంచు కొచ్చేసింది నీరజకి.

అతని భుజం వంపులో ఆ సిగ్గుని దాచేసుకుని రెండు నిముషాల తర్వాత అంది.

"మన పైడమ్మ కూరలు తరగడం అవీ చేస్తుంది. పాపం ముసల్ది! ఒపిగ్గా అన్ని పన్లు చేస్తుంది. ఎప్పుడూ నాగా పెట్టదు. మీ ఆఫీసు వాళ్ల క్కూడా వుండదు అంత రెగ్యులారిటీ! దాని చేత పచ్చడి రుబ్బించడం, కూరలు, వుల్లిపాయలు తరిగించుకోవడం లాంటివి చేయించుకోండి. అది

ఏడాది బట్టి చేస్తున్నాది మనింట్లో. అందుకని నేనింత నిశ్చింతగా 'వెళ్తాను' అని అంటున్నాను. లేకపోతే మిమ్మల్ని యిబ్బందిలో పెట్టి నేను అక్కడికి వెళ్లి ఏం సుఖపడతాను చెప్పండి? అక్కడున్నా నా ధ్యాసంతా యిటే వుంటుంది. పైడమ్మ అన్నీ జాగ్రత్తగా చేస్తుందన్న నమ్మకం వుండబట్టి నేను వెళ్తానని అంటున్నాను. ఏవండీ, నేను వూరికి వెళ్తానండీ."

ఆమె పట్టుదల చూస్తూంటే 'వెళ్లొద్దంటే' యిహ రాద్ధాంత సిద్ధాంతం చేసేలా వుంది. అందుకే ఆఖరికి, శేఖరం అన్నాడు.

"సర్లేవోయ్. వెళ్లు. మరేం చేస్తాం! నా పాట్లేవో నేను పడతాను"...

అతను సరేననగానే నీరజ చాలా సంతోషపడిపోయింది. ఎన్నాళ్లయిందో పుట్టింటికి వెళ్లి! తను హాయిగా అక్కడ కొత్త - కొత్త సినిమాలు చూడొచ్చు. అమ్మ - నాన్నలతో ఎన్నో కబుర్లు చెప్పుకోవచ్చు. నాన్నగారికి వంట్లో ఎలా వుందో? తనని చూసి ఎంతో సంతోషపడిపోతారు. 'వచ్చేవా తల్లీ! ఇప్పటికి నేను జ్ఞాపకం వచ్చేనా!' అంటారు. అమ్మయితే - 'దానికి మొగుడి దగ్గరుంటే మన మెవ్వరం జ్ఞాపకం రావండీ. అది చిన్నప్పట్నుంచి అక్కడే పుట్టి పెరిగింది కదా-' అంటుంది ఎత్తి పొడుపుగా! పైకి అలా అనేస్తుంది, కాని లోపల్లోపల సంతోషిస్తుంది తన కూతురూ అల్లుడూ ఒకర్ని విడిచి ఒకరు వుండలేరని తెల్సి.

"చాల్లెండి. దాన్నే వెనకేసుకొస్తారు. ఎంతైనా తండ్రీ కూతుళ్లు ఒకటే. నేనేగా పరాయిదాన్ని!" అంటుంది అమ్మ మొహం ముడుచుకుని! అవన్నీ వూహించు కుంటూంటే నవ్వొచ్చింది నీరజకి.

ఏడున్నర అయింది. హఠాత్తుగా నీరజకి పైడమ్మ జ్ఞాపకం వచ్చింది. అదేమిటి రోజూ ఆరున్నరకే వచ్చేది. ఇవాళ ఏడున్నర అయినా యింకా రాలేదు! ఏం చెప్మా? ఎప్పుడూ సాధారణంగా చెప్పకుండా వుండిపోదు. ఇదేమిటి యివాళ యింకా రాలేదు? అదొస్తే దానికి, తను వూరికి వెళ్లడం సంగతి చెప్పి, అన్ని పన్లు దానికి అప్పజెప్పి యిల్లు జాగ్రత్తగా చూసుకోమని చెప్పి వెళ్దామనుకుంది! అదింకా రాలేదు. ఏమయిందో దానికి?

ఎనిమిదయినా పైడమ్మ రాకపోయేసరికి నీరజ వుత్సాహమంతా నీరు గారి పోయింది. కాలు కాలిన పిల్లిలా వీధిలోంచి పెరట్లోకి, పెరట్లోంచి వీధిలోకి పది సార్లు తిరిగింది. వీధి గుమ్మం కడుక్కుని, పాచి పనంతా పూర్తి చేసుకుని, స్నానం చేసి, వంట మొదలెట్టింది. అప్పటికీ పైడమ్మ జాడలేదు.

పదయింది. శేఖరం భోజనాని క్కూర్చున్నాడు. నీరజ మౌనంగా వడ్డిస్తోంది. "ఏమిటోయ్? అలా ఆముదం తాగినట్టు ముఖం పెట్టావు? ఏం జరిగింది?"

"పైడమ్మ రాలేదండి." అంది దిగులుగా.

"పోనీ, ఒక్క పూటకి రాకపోతే ఏం పోయింది! దానికేదో యిబ్బంది వుండి వుంటుంది. మధ్యాహ్నం వస్తుందేమో."

"మధ్యాహ్నం కూడా రాకపోతే?"

మరి మాట్లాడలేదు శేఖరం.

చేయి కడుక్కుని లేస్తూ అన్నాడు, "ఓస్! నీ ప్రయాణం గురించి వర్రీ అవుతున్నావా? అది రాకపోతే నేను చేసుకోలేననుకున్నావా పన్లు? ఇంత సరదా పడ్తున్నావు. పోనీ ఓ మాటు వెళ్ళి మీ వాళ్లని చూసిరా."

శేఖరం భోంచేసి ఆఫీసుకి వెళ్ళిపోయేడు. నీరజకి చికాగ్గా వుంది. ఆమె మనసంతా పాడయిపోయింది. అతనికి యిబ్బంది వుండదన్న ధీమాతో తను ప్రయాణం పెట్టుకుంది! ఇప్పుడు చూస్తే యిలాగ. పొద్దున్న రాలేదు. మధ్యాహ్నమైనా వస్తుందో, రాదో!

వారపత్రిక తిరగేస్తున్నా, అందులోని అక్షరాల మీద ఆమె దృష్టి లేదు. ఆమె ధ్యాసంతా పైడమ్మ మీదే. అది రాకపోతే తన ప్రయాణం మానుకోవల్సి వస్తుందేమో. ఎన్నాళ్లయిందో తను చెప్పగా చెప్పగా యిప్పటికి వప్పుకున్నారు! ఆమెకి బెంగ పట్టుకుంది. తన మీద తనకే ఎక్కడ లేని విసుగు కలిగింది. తన జాతకం ఏమిటో గాని తనేది తల్చుకుంటే అది అవదు....

దగ్గరగా వేసి వున్న తలుపు ఎవరో మెల్లగా తోస్తున్నట్టు అయి అటు తిరిగి చూసింది నీరజ

"ఎవరూ?"

లోపలికి వచ్చింది ఒక అమ్మాయి.

"నేను పయిడమ్మ మేనగోడల్నండి. నిన్న రామారావుగోరింటికాడ వాకిలి కడుగుతూ కాలు జారిపడి పోయింది మాయత్త. నెడుం పట్టేసింది. లెగలేక పోతున్నాది. అమ్మగారు యిబ్బంది పడిపోతారే అని పొద్దుటి కాడ్నుంచి ఒకటే యిదైపోతా వుంది. అందుకే నన్ను పంపిందండి. మాయత్తకి నెడంల నొప్పి తగ్గి లెగిసి తిరిగేదాకా నేను పన్లోకి వస్తానమ్మా. ఆ మాట సెప్పడానికే ఒచ్చినాను. మద్దేన్నం వత్తాను."

"నీ పేరేమిటి?"

"రంగి" అంది ఆ అమ్మాయి ఎంతో వినయంగా. దాని మాటలు, దాని వినయం నీరజని ఆకర్షించ లేదు. దాని శరీర సౌష్టవం చూస్తూ ఏ కవీ వర్ణించలేని అందం ఆ పిల్లకి యిచ్చిన దేముడ్ని తల్చుకుని ఆశ్చర్యపోతోంది నీరజ. అలనాడు శ్రీనాథుడు ఆడదాన్ని అంగాంగ వర్ణన చేసేడు. కాని ఈనాడు నవనవలాడే రంగి శరీరం, తెల్లగా... బొద్దుగా.. ముద్ద బంతి పువ్వులా వున్న రంగి అందాన్ని వర్ణించడానికి ఏ శ్రీనాథుడూ సరిపోడు అనిపించింది నీరజకి రంగిని చూస్తే...

"నువ్వు వస్తావా? అయితే మీ అత్త ఎప్పట్నుంచి వస్తుంది?" అడిగింది నీరజ.

"ఏమో సెప్పలేనండీ. దానికి నెడుం విరిగుంటాదని, కట్టేదో కట్టాలని డాకటేరు సెప్తున్నారట!"

ఎక్కడలేని నీరసం ముంచుకొచ్చేసింది నీరజకి.

నీరజ బాధంతా పైడమ్మ నడుం విరిగినందుక్కాదు. పైడమ్మ పన్లోకి రాలేక పోతుందని కాదు. రంగి పనిలోకి వస్తున్నందుకు!

పైడమ్మ పాపం చాలా మంచిది. తనెక్కడ పని చేసుకోలేక యిబ్బంది పడి పోతుందోనని, దానికి వంట్లో బాగు లేకపోయినా మేనకోడల్ని పంపించింది. కాని... తన సంగతి... తన హృదయ ఘోష ఎవరు వింటారు? వినే నాథుడు ఏడీ?

మధ్యాహ్నం శేఖరం టిఫిన్‌కని యింటి కొచ్చేడు. దిగులుగా కూర్చున్న నీరజని చూసి ఇంకా పైడమ్మ గురించే ఆలోచిస్తున్నాదనుకుని దగ్గరగా వచ్చి అన్నాడు.

"నీరజా! ఏమిటి అంత ఆలోచన! నీతో వున్న చిక్కేయిది! ప్రతీదీ తీవ్రంగా ఆలోచించి బుర్ర పాడు చేసుకుంటావు. వెధవది. పైడమ్మ రాకపోతే దానికింత మనసు పాడు చేసుకోవడం ఎందుకు? నేను నిక్షేపంలా చేసుకోగలను అన్ని పన్లు నువ్వెళ్లి హాయిగా వారం రోజులు తిరిగిరా."

సముద్ర కెరటాల్లా అనుమానాలు వువ్వెత్తున్న లేచేయి ఆమెను. ఒక వేళ తను వూరికి వెళ్తుందని తెలిసి... పైడమ్మ రావడం మానేసి రంగిని పంపి... యిదంతా నాటకమా! ఛ. ఛ. తప్పు. తను అలా ఆలోచించకూడదు. అస్సలు పాపం పైడమ్మకి తెలీనే తెలీదు, తను వూరికి వెళ్తుందన్న సంగతి. తన ఖర్మ కొద్దీ తను సరిగ్గా ప్రయాణం పెట్టుకున్నప్పుడే దాని నడుం విరగాలా?

అతను ఆఫీసు కెళ్లి పోయేక రంగి రావడం... అంతా చెప్పింది. "మరింకేం! ఏ యిబ్బంది వుండదు. ఎవరో ఒకరు వచ్చి పని చేసుకు వెళ్లటమే కదా కావల్సింది. ఎవ్వరైతేనేమిటి? మరింకెందుకు దిగులు! హాయిగా, నిశ్చింతగా వూరికి వెళ్లి రావచ్చు నువ్వు..."

నీరజకి దుఃఖం ముంచుకొచ్చేస్తోంది. రంగి... రంగి రూపమే తన కళ్ల ముందు కదుల్తూంటే తట్టుకోలేక పోతోంది. తను వూర్లో వుండదు. ఇంట్లో ఆయన... రంగి.. యిద్దరే! ఆయన వుల్లిపాయలు కోయమని యిస్తారు. రంగి చేతి వేళ్లు ఆయనకి తగుల్తాయి. అసలే చలికాలం. అందులోనూ చెలి వెచ్చదనం కోరే వయసు. ఇంట్లో యింకెవరూ వుండరు! అయ్యో బాబోయ్! అందమైన పని మనుషుల మీద ఎన్నో కార్టూన్లు చదివింది తను, వద్దు బాబూ! ఇలాంటివి భరించడం తన వల్ల కాదు. ప్రయాణం లేకపోతే పోయింది. ఇలాంటి పరిస్థితిలో ఆయన్నొక్కణ్ణే వదిలేసి తను ఛస్తే పుట్టింటికి వెళ్లదు. వెళ్లలేదు. వెళ్తే కొంపలు మునిగిపోతాయి! ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. పాపం ఆయన మంచివారే! కాని ఏమో. రంగి ఎలాంటిదో? చెప్పలేం కదా! జరగకూడనిదేదైనా జరిగిందంటే... తను భరించలేదు. భరించే శక్తి లేదు.

ఈ విషయం అతనికి ఎలా చెప్తుంది తను?! ఆఖరికి ఒక నిర్ణయానికి వచ్చిన దాన్లా అంది "లేదండీ. నేను వూరికి వెళ్లడం లేదు."

"అరే. అదేమిటోయ్? పొద్దున్న దాకా వూరికి వెళ్తానని గెంతేవు. ఇంతలోనే యింత మార్పా? అయినా నువ్వు నా గురించి ఆలోచించకు. ఎలాగోలా పని చేయించు కుంటాను. నాకే యిబ్బందీ వుండదు. తీరా ప్రయాణం పెట్టుకుని, బట్టలు అవీ సర్దేసుకుని యిప్పుడు మానుకోవడం దేనికీ?

శేఖరం ఆశ్చర్యపోతున్నాడు భార్య వైఖరి అర్థం గాక!

"ఎందుకు లెండి. మరోసారి ఎప్పుడైనా మనిద్దరం కలిసే వెళ్దాం. ఇప్పుడు శలవు దొరక్కపోతే మరెప్పుడూ శలవు దొరకనే దొరకదా ఏమిటి? మీకు శలవు దొరికినప్పుడే వెళ్లొచ్చు. ప్రస్తుతానికి ఆ విషయం వదిలేద్దురూ" అనేసి అక్కడ్నుంచి చల్లగా జారుకుంది నీరజ.

★ ★ ★

*(కలువబాల, వీక్లీ ; 16-31 నవంబర్ 87)*